పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

## టెన్త్ ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం

### జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు, ఫిబ్రవరి, 13 ( ప్రభాతవార్త) : జిలాల్లో ఎస్ఎస్సి, ఇంటర్ పరీక్షలలో ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ కి పరీక్ష ఏర్పాట్లను వివరిస్తూ నివేదించారు. శుక్రవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో పలు విషయాలపై కలెక్టర్ నివేదిక సమర్పించారు. వాటిలో ప్రధానంగా ఎస్ ఎస్సీ, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు, ప్రభుత్వ సేవలపై ప్రజల సంతృప్తి స్థాయి, కోర్టు భవనాల కోసం స్థలం, కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో స్థల సమస్యలు, వంటి ప్రధాన అంశాలపై శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్



విజయానంద్ మాట్లాడుతూ ఎస్ఎస్సి., ఇంటర్ పరీక్షల నిర్వహణకు పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకుని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా మాస్ కాపీయింగ్ కి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందించే సేవలపై ప్రజల సంతృప్తి స్థాయిని మరింత పెంచేలా సేవలందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన చర్యలపై జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలియజేస్తూ జిల్లాలో ఈనెల 23వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలు, మార్చ్, 16వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఎస్ఎస్సి పరీక్షల నిర్వహణకు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, ఆర్ఐ ఓ యోహాన్, డివిఈఓ టి. శేఖర్ బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శివరాత్రికి ముస్తాబైన రామలింగేశ్వరుడు

ప్రభాతవార్త చాట్రాయి : మండల కేంద్రమైన చాట్రాయిలో వేంచేసియున్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం శివరాత్రి సందర్భంగా ముస్తాబయ్యింది. ఈనెల 15న మహా శివరాత్రి కావడంతో ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలియజేశారు. పురాతన చరిత్ర కలిగిన శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడం అనాదిగా వస్తున్న ఆనువాయితీ. చాట్రాయి మండలం నుండే కాకుండా పక్క రాష్ట్రమైన తెలంగాణ నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తూ ఉంటారు.ఆదివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు అదే రోజు రాత్రి స్వామి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలియజేసింది.ఈ ఏడాది స్థానాల చెరువులో కూడా నీరు పుష్కలంగా ఉండటంతో ఎటువంటి ఇబ్బంది ఉండదని పిండ ప్రదానాలకు దర్పణాలు వదిలేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కమిటి తెలియజేసింది. దీనికి తోడు జల్లు స్థానం కూడా ఏర్పాటు చేశామని శివరాత్రి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఉదయం 10 గంటల నుండి అన్నదాన కార్యక్రమం ప్రారంభమవుతుందని కమిటీ వివరించండి. ఇక ఆలయ చరిత్ర విషయానికి వస్తే కాకతీయ రెడ్డి రాజుల కాలం నాటి ఈ శివాలయానికి ప్రాముఖ్యత సంతరించుకుంది. ఈ ఆలయానికి ఉత్తర భాగంలో కన్యకల బావి ఉండగా ఈ బావిలో మాత్రం నీరు పుష్కలంగా ఉండటం విశేషం. ఈ బావిలో దేవతా కన్యకల స్థానాలు ఆచరించే వారిని చరిత్ర చెబుతోంది. అందువల్లే అంతటా భూగర్భ జలాలు అడిగినప్పటికీ ఆ బావిలో మాత్రం నీరు పుష్కలంగా ఉండడం విశేషం. ఈ బావిలో



వరసగా 40 రోజులు స్నానమాచరించి పరమశివుడిని భక్తిశ్రద్ధలతో వేడుకుంటే కోరిన కోరికలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. అందువల్లే ఈ ఆలయానికి మంచి ప్రసిద్ధి ఉండటంతో భక్తులు విరివిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుంటారు.

# ఆక్వా రంగానికి మహర్దశ

## -భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందంతో పెరగనున్న ఆక్వా ఎగుమతులు



ఫిబ్రవరి 13, పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో : భారత్ అమెరికా దేశాల మధ్య ఇటీవల జరిగిన వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఆక్వా ఉత్పత్తులపై తగ్గించిన సుంకం కారణంగా ఉభయగోదావరి జిల్లాల్లో ఆక్వా రంగానికి మహర్దశ పట్టనుంది. ఇప్పటికే భారతీయ సముద్ర ఉత్పత్తుల ఎగుమతులపై ప్రస్తుతం ఉన్న 25% నుండి 18%కి సుంకాలను తగ్గించాలన్న అమెరికా నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి మరియు మత్స్యశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు స్వాగతించారు. ఇది ఎగుమతిదారులకు, ఆక్వాకల్చర్ రంగానికి ఒక పెద్ద ఊరట అని ఆయనతో పాటు పలువురు మంత్రులు అభివర్ణించారు. ఈ సుంకాల తగ్గింపు ఆంధ్రప్రదేశ్‌లోని ఆక్వాకల్చర్ రంగానికి శుభసూచకమేనని పలువురు ఆక్వా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక కేంద్ర బడ్జెట్‌లో సుంకాల రాయితీలు, అమెరికా యేతర మార్కెట్ల నుండి స్థిరమైన డిమాండ్ ఈ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయని, తద్వారా రైతులు, రాష్ట్ర మత్స్య ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూరుతుందని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఆక్వా రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలో కొంతమంది రైతులతో మాట్లాడగా రాబోయే నెలల్లో అమెరికాకు ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు 10--15% పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఈ మారిన పరిణామాలతో త్వరలోనే ఆక్వా రంగం మునుపటి స్థాయికి చేరుకుంటుందని భావిస్తున్నారు. గతంలో ఉన్న సుంకాల విధానం, అన్ని సుంకాలతో కలిపి, అసలు భారాన్ని 50--58%కి పెంచిందని, ఇది అమెరికాకు జరిగే ఆక్వా రవాణాపై తీవ్రంగా ప్రభావితం చేసిందని ఆయన అన్నారు. ఈ సుంకాల కారణంగా, 2025 సంవత్సరం ఏప్రిల్, నవంబర్ మధ్య కాలంలో అమెరికాకు భారతదేశ సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు 15% తగ్గి 2.01 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకోగా, ఎగుమతి విలువ 6.3% తగ్గి 1.72 బిలియన్ డాలర్లకు పడిపోయిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గతంలో భారతదేశం నుండి అమెరికాకు ప్రధాన రొయ్యల రకమైన ఫ్రోజెన్ రొయ్యల ఎగుమతిపై ప్రభావం పడింది. ప్రస్తుత నూతన వాణిజ్య ఒప్పందంతో అమెరికా మార్కెట్‌లో భారతీయ సముద్ర ఉత్పత్తులు తిరిగి పోటీతత్వాన్ని పొందుతాయనీ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిలిచిపోయిన ఎగుమతి ఆర్డర్లు తిరిగి ప్రారంభమవుతాయని, ప్రస్తుతం బాండెడ్ గిడ్డంగులలో ఉన్న సరుకులు విడుదలయ్యే అవకాశం ఉందని ఆయన చెప్పారు. సముద్ర ఉత్పత్తుల ప్రాసెసింగ్‌లో 5--5.5%కి పడిపోయిన లాభాల మార్జిన్‌లు 7--8%కి పుంజుకోవచ్చని ఆయన అన్నారు. కేంద్ర బడ్జెట్-2026లో సుంకాల రాయితీలు మరియు అమెరికా యేతర మార్కెట్ల నుండి స్థిరమైన డిమాండ్ ఈ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయని, తద్వారా రైతులు, మత్స్యకారులు మరియు రాష్ట్ర మత్స్య ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ



అంచనా ప్రకారం 2025 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ లో సుమారు 6.5 లక్షల మంది ఆక్వాఫార్మర్లు ఉన్నారు. ఇందులో ప్రత్యక్షంగా రొయ్యల సాగు చేసేవారు ఎక్కువ. ఏలూరు జిల్లాలో మాత్రమే 27,000 మంది రైతులు రొయ్యల సాగు చేస్తున్నారు. ప్రాసెసింగ్, లాజిస్టిక్స్ కలిపి మొత్తంగా సుమారు 30 నుంచి 40 లక్షల మంది ఈరంగంపై పరోక్షంగా ఆధారపడి ఉన్నారు. ఈ ఆక్వా సాగు సుమారు 5 నుంచి 6 లక్షల ఎకరాల విస్తీర్ణంలో నిర్వహిస్తున్నారని అంచనా. ఇదిలా ఉండగా ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఓ సమావేశంలో మాట్లాడుతూ 2030 నాటికి 10 లక్షల ఎకరాలకు పెంచడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా భారత్‌లోని వనామీ రొయ్యల సాగులో భాగంగా ఆంధ్రప్రదేశ్ 71,921 హెక్టార్లు (సుమారు 1.78 లక్షల ఎకరాలు) లో సాగు చేస్తున్నారు. రొయ్యల ఉత్పత్తి: దేశం మొత్తం మీద జరుగుతున్న ఆక్వా సాగు ద్వారా ఆంధ్రప్రదేశ్ ఒక్కటే సుమారు 70-80% రొయ్యలను ఉత్పత్తి చేస్తుంది. ఇటీవలి గణాంకాల ప్రకారం రాష్ట్రం నుంచి సుమారు 6-7 లక్షల టన్నులు ఆంధ్రప్రదేశ్ ప్రతి యేటా ఉత్పత్తి అవుతున్నట్టు అంచనా. అమెరికా భారత్ మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందం ఆక్వా రైతులకు ఎంతో మేలు చేస్తుందని ఆక్వా రైతులు తిరిగి విస్తృత స్థాయిలో ఆక్వా సాగు చేయడానికి పొందడం అవుతారని ఆశిస్తున్నారు.

## శరీర అవరోదాలున్నా ధైర్యం తో ముందుకు సాగాలి

### జె.సి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం ఫిబ్రవరి 13ప్రభాతవార్త :శారీరిక అవరోధాలు ఉన్నప్పటికీ ధైర్యంతో ముందుకు సాగాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు.విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా పోడూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విభిన్న ప్రతిభావంతురాలు గోడి లక్ష్మి ప్రసన్న కు క్రచేస్ ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎవరు ఏ విషయంలోనూ తక్కువ కాదని శారీరక అవరోధాలు ఉన్నప్పటికీ ధైర్యంతో ముందుకు సాగాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిగా వినియోగించుకోవాలని అన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. అవసరమైన సహాయక పరికరాలు, పెన్షన్లు, వైద్య సహాయం వంటి సేవలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఉన్నత చదువులు



చదువుకుని ఆదర్శంగా నిలవాలని విద్యార్థి గోడి లక్ష్మీ ప్రసన్నను జిల్లా జాయింట్ కలెక్టర్ సూచించారు. తమ సమస్యను గుర్తించి వెంటనే ప్రభుత్వం ద్వారా క్రచేస్ అందజేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కి మరియు విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులకు లక్ష్మీప్రసన్న, ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## బోధనేతర పనులకు సిబ్బందిని నియమించాలి : ఎమ్మెల్సీ గోపి మూర్తి



భీమవరం టౌన్, ఫిబ్రవరి 13 : ప్రభాతవార్త : ప్రధానోపాధ్యాయులకు ప్రతిరోజు వెబెక్స్ సమావేశాలు ,మరియు అత్యవసర మెసేజ్ లతో మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని రాష్ట్రస్థాయి అధికారులు మరియు కొన్ని జిల్లాల్లో డిఇఓ లు ప్రధానోపాధ్యాయులను ఏక వచనంతో సంబోధిస్తూ నోటికి ఏది వస్తే అది మాట్లాడి అవమానిస్తున్నారని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి శుక్రవారం మండలిలో స్పెషల్ మెన్షన్ ప్రవేశపెట్టారు. గత ప్రభు త్వంలో ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యా యులను అవమానించారని ఆ పరిస్థితి మరింత పెరిగింది తప్ప మార్పు ఏమిలేదని దీనివలన ప్రధానోపాధ్యాయులు తీవ్రమైన ఆందోళనకు గురిఅవుతున్నారని అన్నారు విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకుని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో అధికారులు సున్నితంగా వ్యవహరించే విధంగా డైరెక్షన్ ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం వివిధ కారణాల రీత్యా అనేక పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఈ పథకాల నిర్వహణకు ప్రత్యేక యంత్రంగాన్ని నియమించక పోవటం వలన ఆ పథకాల నిర్వహణ కూడా బోధనచేసే ఉపాధ్యా యులే నిర్వహించాల్సి వస్తుందని అందువలన విద్యార్థులకు బోధన సమయం తగ్గిపోతుందన్నారు. పథకం నిర్వహించడం ఒక ఎత్తు అయితే పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమాలు పథకాలు ఆన్లైన్ చేయడం, ఫొటోలు అప్లోడ్ చేయడంతో పాటు యాప్ లు అన్నీ కలిపి ఒకే యాప్ గా మార్చిన అందులో దాదాపు వందకు పైగా టైల్స్ ఉంచడం జరిగిందన్నారు.కర్మయోగి, విద్యాశక్తి లాంటి అనేక కార్యక్రమాలతో ఉపాధ్యాయులు సతమతమవుతు న్నందున పాఠశాలల్లో రోజురోజుకు పెరిగిపోతున్న బోధనేతర పనులనిర్వహణ కొరకు నాన్ టీచింగ్ స్టాఫ్ మరియు కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని శాసన మండలి చైర్మన్ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

## జిల్లా అభివృద్ధికి పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలి

### కలెక్టర్ నాగరాణి

భీమవరం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి ఇన్వెస్టర్లతోశుక్రవారం ముఖాముఖి సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం, ఆక్వా రంగాలలో అభివృద్ధి సంతృప్తికరంగానే ఉన్న, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధికి సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. జిల్లాలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటుకు అనేకమంది పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని, నూతన పరిశ్రమల స్థాపనకు అనుమతులు, బ్యాంకు రుణాలు మంజూరు, మౌలిక వసతుల కల్పనలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ భూములు అందుబాటులో లేవని సాధ్యమైనంత వరకు నూతన పారిశ్రామికవేత్తలు సంబంధిత భూ యజమానుల భాగస్వామ్యంతో పరిశ్రమ ఏర్పాటుకు ఆలోచన చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వివిధ రంగాలకు సంబంధించిన ఇన్వెస్టర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న పరిశ్రమల వివరాలు, కొత్తగా ప్రారంభించబోయే పరిశ్రమలు, వ్యాపారాలు గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉండి గ్రామానికి చెందిన అశోక్ డిహైడ్రేషన్ ఆఫ్ ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్ ప్రాసెసింగ్ యూనిట్ గురించి జిల్లా కలెక్టర్ కు వివరించారు. భీమవరానికి చెందిన యువ పారిశ్రామికవేత్త కె.టి ఎన్ సత్యనారాయణ బయో డీగ్రేడబుల్



ప్రొడక్ట్స్ హస్క్ నుండి పేపర్ ప్లేట్లు సింగల్ యూజ్డు, రీ యూజబుల్ ఉత్పత్తులపై వివరించారు. రైస్ మిల్లింగ్ ద్వారా వచ్చే పొట్టు నుండి సిలికాన్ ఉత్పత్తిపై భీమవరానికి చెందిన కృష్ణ తమ ప్రాజెక్టు గురించి జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇన్వెస్టర్స్ తో మాట్లాడుతూ ముడి సరుకు లభ్యత, టెక్నాలజీ వినియోగం, బ్యాంకు రుణాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా యంత్రాంగం తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జిల్లాలో ప్రస్తుతం రైస్ మిల్లులు ఎక్కువ విస్తీర్ణంలో నిర్వహించబడుతున్నాయని, ఖాళీగా ఉన్న భూమిని వినియోగించుకొని రైస్ ఆధారిత ఉప ఉత్పత్తుల యూనిట్ల స్థాపనకు ఆలోచన చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. ఎన్ ఆర్ డి సి ఆధ్వర్యంలో వివిధ రంగాలలో యూనిట్ల స్థాపనకు ముందుకు వచ్చే యువ పారిశ్రామికవేత్తలకు టెక్నాలజీ, మిషనరీ, ముడి సరుకు లభ్యత, మార్కెటింగ్, బ్యాంకు రుణాలు, వివిధ అనుమతులు పై అవగాహన కల్పించేందుకు మార్చి నెలలో వర్క్ షాప్ నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఉండి, ఆకివీడులలో ఉన్న పార్కులకు అనుబంధంగా ఉన్న చెరువుల నందు పిల్లలను, పెద్దలను ఆకర్షించే విధంగా బోటింగ్ సదుపాయాన్ని కల్పించాలని జిల్లా టూరిజం అధికారిని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, జిల్లా టూరిజం శాఖ అధికారి ఏవి అప్పారావు, ఇన్ స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ స్వాతి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జి, చేనేత శాఖ అధికారి కె.అప్పారావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.అరుణ కుమారి, జిల్లా రవాణా శాఖ అధికారి కె.కృష్ణారావు, యూనియన్ బ్యాంక్ ప్రతినిధి పి.ప్రేమ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇన్వెస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు రోలర్ నడిపి మద్యం బాటిల్స్ ను ధ్వంసం చేసిన జిల్లా ఎస్పీ

మొగల్తూరుఫిబ్రవరి 13( ప్రభాతవార్త)పశ్చిమగోదావరి జిల్లాలో అక్రమంగా మద్యం రవాణా మరియు నాటుసారా తయారు స్థావరాలు పై కఠిన చర్యలు తీసుకుంటామని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ ఆదాన్ నయీమ్ అస్మి అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామం మొల్లపర్రు బీచ్ లో శుక్రవారం సాయంత్రం నరసాపురం డివిజన్ పరిధిలో 382 కేసులలో స్వాధీనం చేసుకున్న 6686 లీటర్లు సుమారుగా 24 లక్షలు విలువగల వేలాది సీసాలను,మరియు నాటుసారాను జిల్లా ఎస్పీ స్వయంగా రోడ్ రోలర్ నడిపి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నరసాపురం డి.ఎస్.పి డాక్టర్ శ్రీ వేద, నరసాపురం ఆర్డీవో దాసిరాజు, ఎడిషనల్ ఎస్పీ భీమరాజు, సిఐలు ఎస్ఐలు ఎక్సైస్ సిబ్బంది రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు





## పెన్షన్లపై అసెంబ్లీలో గళమెత్తిన బొలిశెట్టి శ్రీనివాస్



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 13 ( ప్రభాత వార్త): అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో తాడేపల్లిగూడెం శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ శుక్రవారం పలు అంశాలను ప్రస్తావించారు. కొత్త వృద్ధాప్య పెన్షన్లు, ఒంటరి మహిళలకు పెన్షన్లు, పూర్తి అంగ వైకల్యం కలిగి ఉన్న దివ్యాంగులకు రూ 15 వేలు చొప్పున కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ప్రశంసించారు. పూర్తి అంగవైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులకు రూ 15 వేలు చొప్పున కొత్త పెన్షన్ల మంజూరు చేసి అర్హులందరికీ తగిన న్యాయం చేయాలని సూచించారు. వీటితోపాటు పలు అంశాలను అసెంబ్లీలో గళమెత్తి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

## శ్రీకృష్ణ ఎమర్జెన్సీ హాస్పిటల్స్ మరిన్ని వైద్య సేవలు అందించాలి

పెనుమంట్ర, ఫిబ్రవరి-13, ప్రభాతవార్త: మండలంలోని మార్టేరు పంచ గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న శ్రీకృష్ణ ఎమర్జెన్సీ హాస్పిటల్స్ అధినేత డా. కృష్ణ కళ్యాణ్ రెడ్డి (ఎండీ)ను పంచ గ్రామ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యవసర వైద్య సేవలు సమయానికి అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. మున్ముందు కూడా హాస్పిటల్ ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మరింత విస్తృతంగా, తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించాలని నాయకులు కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించాలని సూచించారు. డా.



కృష్ణ కళ్యాణ్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరి బ్రహ్మేశ్వర్ రెడ్డి, వెలగల నారాయణరెడ్డి, సత్తి విష్ణుకుమార్ రెడ్డి, తమనంపూడి ఈశ్వర్ రెడ్డి, సత్తి సుబ్బారెడ్డి, చిర్ల సత్యనారాయణరెడ్డి, సత్తి సత్యనారాయణ రెడ్డి, చిర్ల నరసింహారెడ్డి, చింతా అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బార్ కౌన్సిల్ ఎన్నికల కోలాహలం

## న్యాయవాదిగా ఓటు హక్కు వినియోగించుకున్న మాధవ నాయుడు



నరసాపురం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : రాష్ట్రవ్యాప్తంగా ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. దాదాపు 150 మంది న్యాయవాదులు ఎన్నికల బరిలో నిలిచారు. చాలా చోట్ల బార్లలో ఆయా స్థానిక న్యాయవాదులు హైకోర్టుకు వెళ్లిన తర్వాత స్థానికతతో ఉన్న పరిచయాల రీత్యా గట్టి పోటీ ఇచ్చారు. అందువల్ల మొదటి స్థానం కోసం చాలామంది పోటీపడ్డారు. నరసాపురం బార్ నుంచి వెళ్ళిన కే చిదంబరం జిల్లా స్థాయిలో విస్తృత ప్రచారం చేసి తోటి న్యాయవాదులు యొక్క అభిమానాన్ని చూడగొనేందుకు కృషి చేశారు. నరసాపురం పాలకొల్లు భీమవరం తణుకు తాడేపల్లిగూడెం ఏలూరు బార్లలో భారీగా పోలింగ్ జరిగింది. నరసాపురం బార్ ఎన్నికలను బార్ అసోసియేషన్ అధ్యక్షులు బూసి విశ్వేశ్వరరావు ఎన్నికల అధికారిగా ఉండి నిర్వహించారు. కార్యదర్శి వెన్న ప్రకాష్ ఎర్రశెట్టి ఫణి దాసరి శ్రీనివాస్ వైదాని నాగేశ్వరరావు అందే ఆచార్యులు రాజా తదితరులు పోలింగ్ నిర్వహణకు కృషి చేశారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు న్యాయవాదిగా తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. న్యాయవాదులుగా ఉన్న స్థానిక ప్రముఖులు పలువురు ఈ సందర్భంగా ఓటు హక్కును వినియోగించుకుని పోలింగ్లో పాల్గొన్నారు.



## వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి కళ్యాణోత్సవాలు

తణుకు, ఫిబ్రవరి 13 (ప్రభాతవార్త) తణుకు పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న గోవింద మాంబా సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణం జరుగుతుందని ఆలయ కమిటీ వారు తెలిపారు. 15 న ఉదయం గ్రామోత్సవం, రాత్రి స్వామి వారి కళ్యాణం బొల్లోజు మల్లికార్జునరావు కొత్తూర్తి రాజా వెంకట చెల్లాచారి దంపతులచే జరుగుతుందని తెలిపారు. 16న పుష్పయాగ ఉత్సవం జరుగుతుందని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ తమిరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గురజాపు శ్రీనివాసరావు, స్వర్ణకార సంఘం గౌరవాధ్యక్షుడు సొట్యాణ లక్ష్మణరావు, కీర్తి శివప్రసాద్, అధ్యక్షుడు నాగమల్లి సాంబశివరావు, కార్యదర్శి కోరిమిల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయి.

# అత్యంత ప్రాచీనమైన ఉమా సిద్దేశ్వర స్వామివారి ఆలయం



అత్తిలి, ఫిబ్రవరి 13 (ప్రభాత వార్త ) అత్తిలి ఉమా సిద్దేశ్వర స్వామి దేవాలయం అత్యంత ప్రాచీనమైనది. అత్రి మహాముని తపస్సు ఆచరించిన ప్రాంతం కావడంతో ఈ దేవాలయానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఒకప్పుడు ఈ ప్రాంతాల్లో అత్రి మహాముని అనసూయా దేవి నివసించే వారిని పురాణాలు తెలుపుతాయి.ప్రతి నిత్యం శివారాధన చేయడం కోసం శివలింగాన్ని ఏర్పాటు చేసి అభిషేకాలు చేసేవారు. అభిషేకం కోసం గంగా జలాలను తీసుకురావడానికి కాశీ వెళ్లేవాడని చెబుతారు. అక్కడ నుండి తెచ్చిన గంగా జలాలతో అభిషేకం జరిపే వారిని అంటారు. ఒక రోజు అత్రి మహా ముని కి నలతగా ఉండటంతో తన భార్య అనసూయ దేవిని గంగాజలం తీసుకు రమ్మని పంపుతారు. ఆమె ఎంత దూరం వెళ్ళినా గంగాజలం కనిపించకపోవడంతో విచారంగా ఉంది. అదే సమయంలో గంగాదేవి ప్రత్యక్షమై ఎందుకు విచారిస్తున్నావని ప్రశ్నించడంలో తనకు గంగాజలం అవసరమని తెలుపుతుంది. అంత దూరం వెళ్ళనవసరం లేదు ఇక్కడే గంగాజలం ఉందని గంగాదేవి అనసూయ కి చెబుతుంది. ఒక్కసారి ఆమె గిర్రున తిరగడంతో గంగాజలం భూమి పైకి వస్తుంది. అంతటా అనసూయదేవి ఆ గంగా జలాన్ని తీసుకుని వెళ్లి తన భర్త అత్రి మహామునికి అందజేస్తుంది. జరిగిన వృత్తాంతాన్ని తెలుపుతుంది. అంతట మహాముని అక్కడికి రాగా గంగాదేవి కనిపించదు. గంగాజలం కనిపించిన ప్రాంతంలో ప్రస్తుతం నుయ్యి ఉంది. దానినే సిద్దయ్య నుయ్యి గా పిలుస్తారు. అత్రి మహాముని ఆర్చించిన శివలింగం వద్ద తాను ఉండేలా వరం కోరుతాడు. అభిషేక జలాలు తన మీదుగా ఉండేలా శివుని కోరతాడు. కాలక్రమేణా శివలింగం భూమిలోపల ఉండడంతో రైతులు పొలం దున్నతుండగా శివలింగం బయట పడుతుంది. లింగాన్ని వెలికి తీసి అర్చనలు చేయడం ప్రారంభించారు. అందుకే శివలింగం పైన ఎద్దు గిట్ట దిగబడి ఉండటం ఇప్పటికీ కనిపిస్తుంది. అత్రి మహాముని విగ్రహం కూడా శివలింగం పక్కనే ఉంటుంది. ఇప్పటికే అభిషేక జలాలు అత్రి మహాముని మీదుగా వెళ్లతాయి. ఈ శివలింగం పచ్చిమాభి ముఖంగా ఉంటుంది భూమికి ఆరడుగుల దిగువన శివలింగం ఉంటుంది. ఏకశిలా ధ్వజస్తంభం, పానపట్టం లేని శివలింగంగా దేవాలయం గా గుర్తిం పొందింది. ఉమాపార్వతీ సమేత సిద్దేశ్వర స్వామి వారి ఆలయంలో 13 నుండి 17 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బండి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి చలువ పందిళ్ళ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. స్వామివారిని పెండ్లి కుమారుని గాను, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా చేసినట్లు తెలిపారు. సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు.. 14వ తేదీ సాయంత్రం ఏడు గంటలకు బండి నాగేశ్వరరావు దంపతులచే కళ్యాణం జరుగుతుందన్నారు. 15న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున మూడు గంటల నుండి స్వామివారి దర్శనం, అభిషేకాలు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. వర్తకులు, రైతులు, భక్తుల సహకారంతో అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు. 16న పూజా కార్యక్రమాలు, 17న పూర్ణాహుతి,త్రిశూల స్నానం, పుష్పయాగోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

## సిఆఎ రిజిస్ట్రేషన్లకు ఎన్ఓసి సంబంధిత ఆర్డీవో కార్యాలయాల ద్వారానే పొందాలి

### - జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం ఫిబ్రవరి 13ప్రభాతవార్త : సిఆఎ (కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ) రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో భాగంగా అవసరమైన ఎన్ఓసి (నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్)లను సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయాల ద్వారా మాత్రమే పొందాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు.సిఆఎ రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఇనామ్, జమీందారి భూములు అలాగే మొగల్తూరు మండలం, నర్సాపురం , యలమంచిలి, భీమవరం మండలాల్లో వెబ్ ల్యాండ్ లో డేటా లేని రైతులు సాగు చేస్తున్న భూముల వివరాలను మత్స్యశాఖ అధికారులు సమగ్రంగా సేకరించాలని ఆదేశించారు. ఆ వివరాల ఆధారంగా సంబంధిత ఆర్డీవో కార్యాలయాల ద్వారా ఎన్ఓసి పొందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్ఓసి పొందేందుకు ఎవరూ వీఆర్వోలను సంప్రదించవలసిన అవసరం లేదని, ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత ఆర్డీవో కార్యాలయం లేదా మత్స్యశాఖ అధికారులను మాత్రమే సంప్రదించాలని జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలను జారీచేశారు. అలాగే వెబ్‌ల్యాండ్‌లో డేటా నమోదైన ఆక్వా రైతులు అప్పుడా రిజిస్ట్రేషన్లను రెవెన్యూ శాఖతో సంబంధం లేకుండా మత్స్యశాఖ అధికారులు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. వెబ్ ల్యాండ్ లో డేటా నమోదుకాని రైతులు తప్పనిసరిగా సిఓసి పొందాలని, వీరికి సంబంధించిన వివరాలను మత్స్య శాఖ సిబ్బంది సేకరించి ఆర్డీవో కార్యాలయం ద్వారా సిఓసి పొందడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రక్రియలో ఆలస్యం లేకుండా రైతులకు సౌలభ్యం కల్పించేలా శాఖల మధ్య సమన్వయం ఉండాలని పేర్కొన్నారు.

# సాగునీటి పనులు సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్ నాగరాణి



భీమవరం ఫిబ్రవరి 13ప్రభాతవార్త :జిల్లాలో సాగునీటి పారుదలకు ఇబ్బంది లేని విధంగా అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలో చేపట్టిన, చేపట్టవలసిన వివిధ సాగునీటి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ గత సమావేశంలో శాసనసభ్యులు ప్రస్తావించిన సాగునీటి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు మంజూరు కానీ పనులకు వెంటనే ప్రతిపాదనలను సమర్పించాలని సూచించారు. సాగునీటి డ్రైయిన్ లు, షట్టర్లు, కాలవగట్లు దెబ్బతినే అవకాశం ఉన్న పనులను ముందుగానే గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేసి, మంజూరు అయిన వెంటనే పూర్తి చేయాలన్నారు. పనులు మంజూరులో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ దృష్టి తీసుకురావాలని సూచించారు. కాలవలు కట్టివేతకముందే టెండర్లను ముగించి కాలవలు నిలుపుదల చేసిన వెంటనే పనులను ప్రారంభించాలని ఆదేశించారు. తూడు తొలగింపు పనులు మంజూరైన కాలువలు, డ్రైయిన్ లలో కంటికి కనిపించేంత స్పష్టంగా తొలగింపు పనులను చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మొగల్తూరు మండలంలో ఎక్కువ తూడు తొలగింపు పనులు మంజూరయ్యాయని, ఎక్కడ ఫిర్యాదు రాని విధంగా త్వరగా పనులను పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరి నెలాఖరకు నరసాపురం నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఉండవచ్చని సూచనప్రాయంగా తెలియజేశారు. పశ్చిమ డెల్టా కింద 11 ప్రధాన కాలువలు 352.62 కిలోమీటర్ల విస్తరించి ఉన్నాయన్నారు. బ్రాంచ్ కెనాల్సు 1,044.57, మేజర్ డ మైనర్ కెనాల్స్ 824.11 కిలోమీటర్లు మొత్తం 2,221 కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఓ అండ్ ఎమ్ పనులకు రూ.1273.65 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. 152 తూడు తొలగింపు, 74 పూడిక తీత, 24 షట్టర్లు మరమ్మత్తులు, 41 టేప్ గ్రాస్ తొలగింపు, 42 ఇతర పనులు ఉన్నాయన్నారు. అలాగే డ్రైయిన్స్ లో తూడు తొలగింపు, ఇతరత్రా పనుల నిమిత్తం మంజూరు చేసిన నిధులను సక్రమంగా వినియోగించి సకాలంలో పనులను పూర్తి చేయాలన్నారు. దర్భ రేవు పూడికతీత పనులకు వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కెనాల్స్ ఇఇ యు.రమేష్, డ్రెయిన్లు ఇఇ సీహెచ్ సత్యనారాయణ, డీఇలు పి ఎన్ వి ఎస్ ఎస్ మూర్తి, కే ధర్మజ్యోతి, ఏ వెంకటలక్ష్మి, కే శ్రీనివాస్, జి వినోద్ చంద్, వెంకటనారాయణ, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

# భక్త కోటికి మావుళ్ళమ్మ ఆశీర్వచనాలు

## ముగిసిన మావుళ్ళమ్మ మహోత్సవాలు



భీమవరం టౌన్, ఫిబ్రవరి 13 : ప్రభాతవార్త :పశ్చిమగోదావరి జిల్లాకేంద్రం భీమవరం పట్టణంలో వేంచేసియున్న ప్రజల జీవితాల్లో పచ్చదనం నింపే తల్లి , ఇలవేల్పు, ఆరు దశాబ్దాలుగా ఆశీర్వచనాలు అందజేస్తూ కోట్లాది భక్తుల జీవితాల్లో వెలుగు నింపుతున్న మహాతల్లి మావుళ్ళమ్మవారి 62వ వార్షిక మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. జనవరి 13 నుండి ప్రారంభమైన ఉత్సవాలు మాసం పాటు జరిగి ఫిబ్రవరి 13న ముగిశాయి. చివరి రోజు అయిన శుక్రవారం నాడు ఉదయం 7:30 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించగా జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు మహా నివేదన కార్యక్రమం ప్రారంభించారు. హాజరైన భక్తకోటి భక్తి ప్రపత్తులతో మహా ప్రసాదం స్వీకరించారు. పోటెత్తిన భక్తకోటితో పట్టణం పులకించింది. అనంతరం 36 కిలోల లడ్డును 1 లక్ష,45 వేలకు బోడపాటి చినబాబు వేలంలో దక్కించుకున్నారు. నెల రోజులపాటు జరిగిన ఉత్సవాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ఆమె దీవెనలు అందుకున్నారు. హరికథలు బుర్రకథలు కోలాటాలు గీత విభావరి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నెల రోజులపాటు భక్తులను అలరించాయి ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్, చైర్మన్ బొండాడ నాగభూషణం, నీరుల్లిపాయ కూరగాయ పండ్ల వర్తక సంఘం సభ్యులు కొప్పుల సత్తిబాబు రామాయణం గోవిందరావు రామాయణం సత్యనారాయణ కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు జనసేన నాయకులు ఎర్రం శెట్టి శివకృష్ణ సుంకర రవి పత్తి హరివర్ధన్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రకాశం విగ్రహ స్థాపనకు మద్దతు పట్ల హర్షం



భీమవరం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి హైదరాబాద్ ప్రకాశం అభివృద్ధి అధ్యయన ట్రస్ట్, భీమవరం డిఎన్నార్ కళాశాల యాజమాన్యం సంపూర్ణ మద్దతు ప్రకటించడం హర్షించదగ్గ విషయమని పలువురు వక్తలు హర్షం ప్రకటించారు. శుక్రవారం భీమవరం డిఎన్నార్ కళాశాలలో సమీవేశం నిర్వహించి హర్షం ప్రకటించారు. విగ్రహ సాధన కమిటీ కార్యదర్శి చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని అందరి సహకారంతో భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్ లో ఏర్పాటు చేస్తామన్నారు. అధ్యయన ట్రస్ట్ సంయుక్త కార్యదర్శి నిరంజన్ దేశీయ్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు విగ్రహ స్థాపనకు మా సంస్థ కొంత విరాళం కూడా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, పి భాస్కరరావు, పి అమూల్యరావు విద్యార్థులు పాల్గొన్నారు.

# ద్వారకాతిరుమలలో మార్చి 20 నుంచి రాష్ట్రస్థాయి ఆవుల అందాలు, పాల పోటీలు



ప్రభాతవార్త -ద్వారకాతిరుమల:: పవిత్ర పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల మార్కెట్ యార్డ్ ఆవరణంలో మార్చి 20, 21, 22 తేదీల్లో రాష్ట్రస్థాయి ఆవుల అందాలు మరియు పాల పోటీలు నిర్వహించనున్నట్లు గోపాలపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఉావీజ) చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు వెల్లడించారు. ఈ మేరకు మార్కెట్ యార్డ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలకు అనువైన స్థలాన్ని పరిశీలించామని, రైతులకు ప్రోత్సాహం అందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. వ్యవసాయం మరియు పాడి పరిశ్రమలను ప్రోత్సహిస్తూ, యాంత్రిక జీవనశైలితో పెరుగుతున్న అనారోగ్య సమస్యల నుండి సమాజాన్ని దూరంగా ఉంచేందుకు ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పశుసంవర్ధక శాఖ, ప్రకృతి వ్యవసాయ శాఖ మరియు పాడి రైతుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. ఒంగోలు, పుంగనూరు గోజాతి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పలపాటి చక్రపాణి మాట్లాడుతూ దేశీయ జాతుల సంరక్షణ మరియు రైతుల్లో అవగాహన పెంపొందించడమే పోటీల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఆవుల సౌష్టవం, నడక తీరు, జాతి లక్షణాల ఆధారంగా విజేతలను ఎంపిక చేసి ప్రైజ్ మనీ అందజేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రసిద్ధిగాంచిన ఒంగోలు జాతి మరియు పుంగనూరు జాతి ఆవులు ఈ పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, ద్వారకాతిరుమల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లంకా సత్యనారాయణ, గుండుగొలనుకుంట సొసైటీ చైర్మన్ అద్దంకి శేఖర్, మాజీ సొసైటీ చైర్మన్ తుంపాటి సత్యనారాయణ, గోపాలపురం నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు పాతూరి సహృదయ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్, మండల ఐటిడిపి అధ్యక్షులు ఏపూరి కిషోర్, పార్టీ నాయకులు నాదెళ్ల వేణు, చిలుకూరి సుబ్రమణ్యం, నాదెళ్ల వెంకటేశ్వరరావు, పల్లి రాంబాబు, గువ్వల మావుళ్లు, ఆచంట సత్యనారాయణ, గోరంట్ల చంద్రశేఖర్ తదితరులు మరియు మండలంలోని వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## మతం కన్నా మానవత్వమే మిన్నని నమ్మిన వ్యక్తి సరోజినీ నాయుడు



భీమవరం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :భారత కోకిల మతాల కన్నా మానవత్వమే ముఖ్యమని నమ్మిన మణిపూస సరోజినీ నాయుడు అని శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ సభ్యులు అరసవల్లి సుబ్రమణ్యం అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సర్ సివి రామన్ స్కూల్లో శుక్రవారం సరోజినీ నాయుడు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ హిందూ ముస్లింలు ఐకమత్యంతో స్వాతంత్ర్యం సమరంలో ముందుకెళ్లాలని ఉద్బోధించారన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ పెండ్యాల సరిత మాట్లాడుతూ స్వాతంత్ర్యం లభించిన తర్వాత దేశంలో తొలి మహిళా గవర్నర్ గా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి నియమించబడి ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారని, ఆమె సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం సరోజినీ నాయుడు జన్మదినం ఫిబ్రవరి 13న జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సరోజినినాయుడు భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక వ్యక్తి అని, కవయిత్రిగా ఆమె చేసిన కృషికి మహాత్మ గాంధీ నుండి నైటింగేల్ ఆఫ్ ఇండియా బిరుదు లభించిందన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ సత్యనారాయణ రాజు, ఎస్ కే చాన్ భాషా, ఉపాధ్యాయులు కే పార్వతి, శైలజ విద్యార్థులు పాల్గొన్నారు.

## శివరాత్రి ఏర్పాట్లు పై సమీక్ష

భీమవరం ఫిబ్రవరి 13ప్రభాతవార్త :జిల్లాలో ప్రముఖంగా ఉన్న రెండు పంచారామ క్షేత్రాలతో పాటు, ప్రాముఖ్యత కలిగన శైవాలయాలలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.వెలగపూడి సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ప్రభుత్వ సేవలపై ప్రజా సానుకూల స్పందన, మహాశివరాత్రి ఉత్సవాలు, పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, కోర్టు భవనాల స్థలాలపై వీక్షణ సమావేశం నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలపై ప్రజలు సంతృప్తి స్థాయి పెరగాలని సిఎస్ కోరారు.

## అర్జీల పరిష్కారానికి కృషి

### - తోట సీతారామలక్ష్మి.



భీమవరం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :భీమవరం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జి పోలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి నియోజకవర్గ ప్రజల నుండి టిడిపి నాయకుల సమక్షంలో అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా తోట సీతారామలక్ష్మీ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత టిడిపి జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో ప్రజల నుండి ప్రతి శుక్రవారం ఫిర్యాదులు అర్జీలు స్వీకరించే వారిని ఫిర్యాదులు, వినతులు అధిక సంఖ్యలో వస్తున్నందు వల్ల ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించమని టిడిపి అధినేత చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారన్నారు. మాదృష్టికి తీసుకువచ్చిన వితంతు పెన్షన్లు, వయోవృద్ధుల పెన్షన్లు,గత వైసిపి ప్రభుత్వంలో వివిధ కారణలవళ్ళ నిలిపివేసిన పెన్షన్ల అర్జీలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లా టిడిపి అధ్యక్షుడు ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ ప్రతిపక్ష హోదా కోల్పోయిన వైసీపీ జగన్ తిరుపతి మహా ప్రసాదలడ్డులో కల్తీ నెయ్యి, నకిలీ మద్యం కేసుల దృష్టిని మలిచేందుకే రాష్ట్రంలో కులాల మధ్య చిచ్చు రేపుతున్నారని విమర్శించారు. ఈసమావేశంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందుకూరి రామలింగరాజు ఏపీ కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు వివిధ కార్పొరేషన్స్ డైరెక్టర్లు పామర్తి వెంకటరామయ్య ఉప్పులూరి చంద్రశేఖర్ ఎండి షబీనా జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు మాదాసు కనకదుర్గ బీమవరం పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు మద్దుల రాము చల్లబోయిన గోవింద్ భీమవరం మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు కొయ్యలగడ్డ గణపతి కోళ్ల సీతారాం, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల నాగబాబు వీరవాసరం మండల టిడిపి ప్రధాన కార్యదర్శి వీరవల్లి శ్రీనివాస్ భీమవరం పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు గొలగాని రమేష్ ఉపాధ్యక్షుడు చెరుకు తిరుపతిరావు టిడిపి నాయకులు నేదునూరి గంగాధర్ తిలక్ ఎండి ఫిరోజ్ ఎస్కె రబ్బాని సయ్యద్ నసీమా బేగం గంధం రాధ వలవల ఆదిలక్ష్మి ఎలమంచిలి శ్రీనివాస్ విన్నకోట వినాయక్ చింతా కనకయ్య కౌరు పృథ్వీశంకర్ కోళ్ల చిన్న సీతారాం మైగాపుల గంగారం తమ్మినీడి నాగేశ్వరరావు గండి భూషణం టిడిపి నాయకులు టిడిపి గ్రామ వార్డ్ కమిటీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మున్సిపల్ ఆర్. డి

### నగనర్సింహారావు సమీక్ష



భీమవరం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : భీమవరం పురపాలక సంఘ కార్యాలయం లో రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగనసింహారావు పురపాలకు సంఘ విభాగాల అధిపతులు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో ఆస్తిపన్ను వసూలు, నీటి పన్ను వసూలు పట్టణంలోని అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ, పట్టణ పరిధిలోని షాపుల నుండి వసూలు చేసే డి అండ్ వో ట్రేడు లైసెన్స్ ఫీజు వసూళ్ల పై సమీక్షించారు. పురపాలక సంఘ పరిధిలో ఇంకను విధించవలసిన ఇంటి పన్నులు ఖాళీ స్థలం పన్నులు కుళాయి పన్నుల పై సర్వే నిర్వహించి తగు చర్యలు తీసుకోవలసిందిగా డి. ఆర్. ఆదేశించారు. పన్నేతర వసూళ్లను సకాలంలో వసూలు చేసి పురపాలక సంఘం ఆదాయం పెంచుటకు పలు ఆదేశాలు జారీ చేసారు. పురపాలక సంఘ పరిధిలో పారిశుధ్య పురోగతిపై సమీక్ష నిర్వహించి పట్టణంలో తడి పొడి వ్యర్థాలను వేరువేరుగా సేకరించి వాటిని 100% ప్రాసెస్ చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేసారు. ప్రజల నుండి వచ్చే పీజీఆర్ ఎస్, పురమిత్ర ఫిర్యాదులను సకాలంలో సరైన పద్ధతులు పరిష్కరించవలసిందిగా సిబ్బంది అందరికీ ఆదేసించారు. ఈ సమీక్ష సమావేశంలో కమిషనర్ కె. రామచంద్ర రెడ్డి , అసిస్టెంట్ కమిషనర్ ఏ. రాంబాబు మున్సిపల్ ఇంజనీరు అసిస్టెంట్ సిటీ ప్లానర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు. డి. ఆర్.నాగనర్సింహారావు పట్టణంలో పలు ప్రాంతాలు కమీషనర్ రామచంద్రారెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించారు.

# వాలిబాల్ టీంకు బహుమతుల ప్రధానం



వేలేరుపాడు, ఫిబ్రవరి 13,ప్రభాత వార్త : రామవరం ప్రగతిశీల యువజన సంఘం మరియు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న వాలీబాల్ టోర్నమెంట్ శుక్రవారం ఫైనల్స్ కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేలేరుపాడు ఎస్సై పి. నవీన్ కుమార్ బహుమతులను అందజేసి యువతను ఉద్దేశించి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడల వైపుకు కొనసాగాలని యువతకు సందేశాన్ని ఇచ్చి గ్రామస్తులను అభినందించారు. యువతకు క్రీడా స్ఫూర్తిని కలిగించాలనే ఉద్దేశంతో విజయం సాధించిన విజేతలకు బహుమతిగా ఆర్థిక సహాయాన్ని అందించిన దాతలు మొదటి స్థానం విజయం సాధించిన మల్లారం టీం కు కూరం ప్రసాద్ హెల్త్ అసిస్టెంట్ 10116 రూపాయలు,రెండవ స్థానం విజయం సాధించిన రామవరం టీంకు రామవరం గ్రామ కమిటీ సభ్యులు 5116 రూపాయలు,మూడవ స్థానం విజయం సాధించిన కోయమాధవరం టీంకు చిర్రి దేవరాజు ప్రధానోపాధ్యాయులు 3116 రూపాయలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు పిట్ట ప్రసాద్, సోడే విజయ, కంటిపల్లి నాగేంద్రబాబు, ఎంపిటీసీ కట్టం రత్తమ్మ,సిపిఐ యంఎల్ జిల్లా నాయకులు సిరి కొండ రమరావు,మాజీ ఎంపీటీసీ గద్దల ముత్యాలరావు, మడకం నాగేశ్వరరావు కారం బాబూరావు మడకం చిన్నబ్బి తెల్లం సింగయ్య మరియు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ఆల్బెండజోల్ మాత్రలు పంపిణి



అత్తిలి / గణపవరం, ఫిబ్రవరి 13( ప్రభాత వార్త )గణపవరం మండలం కాశిపాడు మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్ నెంబర్ 2 లో విద్యార్థులకు ఆరోగ్య కార్యకర్త నామాల రాజు ఆల్బెండజోల్ మాత్రలను ప్రధానోపాధ్యాయులు చల్లా కృష్ణ కి అందజేశారు. ఈ మాత్రలను ఈనెల 17న మధ్యాహ్నం భోజనం తర్వాత విద్యార్థులందరికీ కూడా అందచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డివిఎల్ పార్వతి, కలిదిండి ప్రసాద్ పాల్గొన్నారు

## అర్ధవరం లో ఫ్రై డే డ్రై డే

అత్తిలి/ గణపవరం, ఫిబ్రవరి 13 ( ప్రభాత వార్త )గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సచివాలయాలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కె.ఓంకార్ నాథ్, అర్ధవరం లో తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్. ప్రసాద్ పాల్గొన్నారు. ఇంటింటా ఫీవర్ సర్వే, చేయాలనీ , ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే గా ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ప్రతి ఇంటిని ఇరుప్రక్కల తడి లేకుండా పొడిగా ఉంచుకొనుటవలన దోమలు పుట్టకుండా ఉంటాయని తెలియజేశారు . కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జే. విల్సన్ బాబు, మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్. దివ్యభారతి, ఎల్లే లక్ష్మీకాంతం ,టీ. అఖల హెల్త్ అసిస్టెంట్ జి. కృష్ణంరాజు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వమిత్వ సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

### -జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి



భీమవరం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : జిల్లాలో ఫేజ్- 2 స్వమిత్వ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.జిల్లా కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నుండి శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, స్వమిత్వ ప్రోగ్రెస్ పై జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయితీ కార్యదర్శులు, స్వమిత్వ కేటాయించిన సర్వేయరులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఫేజ్- 2 స్వమిత్వ సర్వే జరుగుచున్న 197 గ్రామాలుగాను చివరి దశకు చేరుకున్న 54 గ్రామాలు సర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా గ్రౌండ్ ట్రూత్ నింగ్ గ్రౌండ్ వ్యాలిడేషన్ పూర్తిచేయాలని ఆదేశించారు. భూ యజమానుల హక్కులను స్పష్టంగా నమోదు చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం అని అన్నారు. ఇప్పటికే పూర్తయిన గ్రామాలు వివరాలు పెండింగ్ లో ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు సర్వేలో ఎలాంటి నిర్లక్ష్యం ఆలస్యము ఉండకూడదని అన్నారు. ముందుగా స్వమిత్వ గ్రామసభలు నిర్వహించాలన్నారు. గ్రామసభలలో ప్రజల వద్ద నుండి ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని స్వీకరించి పరిష్కరించాలన్నారు. ఆయా గ్రామాలలో తుదిదశకు తీసుకువచ్చినవి గెజిట్ నోటిఫికేషన్ రిపోర్టును, అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులు ఆదేశించారు.

## ముస్లిం స్మశాన వాటిక అభివృద్ధికి రెండు లక్షలు విరాళం ప్రకటించిన వడ్డి రఘురామ్



తాడేపల్లిగూడెం టౌన్, ఫిబ్రవరి 13 (ప్రభాతవార్త) :తాడేపల్లిగూడెంలో గల ముస్లిం స్మశాన వాటిక అభివృద్ధికి స్థానిక వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వడ్డీ రఘురాం 2 లక్షల విరాళాన్ని ప్రకటించారు. శుక్రవారం తాడేపల్లిగూడెం పట్టణం 9వ వార్డులో ముస్లిం నాయకులు మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు గురించి ముస్లిం నాయకులతో చర్చించారు. ఈ ఈ క్రమంలో ముస్లిం సోదరులు చేసిన విజ్ఞప్తి మేరకు వడ్డి రఘురామ్ నాయుడు స్పందించి ఖబరిస్తాన్ (సమాధుల స్థలం) ను మెరక చేయుటకు రెండు లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించారు. భవిష్యత్తులో వారికి ఎటువంటి సమస్య వచ్చినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామినిచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు వడ్డి రఘురామ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు వైసీపీ ఇంచార్జ్ బూది దుర్గా ప్రసాద్, మాజీ టౌన్ ప్రెసిడెంట్ గుండుమోగుల నాగు, కలిశెట్టి తాతా రావు, మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాసరావు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.